క్లుప్తంగా

రోడ్డు నిర్మించాలని వినతి

మానకొండూర్‌రూరల్‌: మండలంలోని వేగురుపల్లి గ్రామం నుంచి లింగాపూర్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇసుక ట్రాక్టర్ల రవాణాతో రోడ్డు గుంతలమయంగామారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

అత్యవసర పనులకు శ్రీకారం

హుజూరాబాద్‌: మున్సిపాలిటీలో వివిధ అత్యవసర పనులకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఉగాది, శ్రీరామనవమి పండుగలతోపాటు అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లకు రూ.13 లక్షలతో చేపట్టే పనులకు టెండర్ నోటీసు జారీ చేశారు. 19న టెండర్లు సమర్పించాలని, అదేరోజు సాయంత్రం టెండర్లు ఓపెన్ చేయనున్నామని అధికారులు వెల్లడించారు.

చెక్కులు పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్, రామంచ గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. వేర్వేరుగా జరిగిన పంపిణీ కార్యక్రమంలో పార్టీ గ్రామాల అధ్యక్షులు ఇనుగాల శ్రీనివాస్‌రెడ్డి, వంటకాల సంపత్‌రెడ్డి, నాయకులు ఠాకూర్ నరేందర్‌సింగ్, దొబ్బల తిరుపతి, రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్, మహిపాల్‌రెడ్డి, ఎండీ షాబొద్దీన్, బోయిని వంశీకృష్ణ, మల్లయ్య, కనుకయ్య, దుర్గయ్య, దిలీప్‌సింగ్, రాజేందర్, వేణు, తిరుపతి, రాయమల్లు, బొందయ్య ఉన్నారు.

పరీక్ష ప్యాడ్లు...

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, కేజీబీవీ పదోతరగతి విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షారూఖ్ సొంతంగా విద్యార్థుల కోసం పరీక్షా ప్యాడ్లు, పెన్నులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్వయ్య, తిరుపతి, హిసామొద్దీన్, సదానందం, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఆఫీసర్‌గా ఎంపిక

చొప్పదండి: పట్టణంలోని కుడి చెరువు సమీపంలో నివాసం ఉండే మంచికట్ల కుమార్ హాస్టల్ ఆఫీసర్ గ్రేడ్ – 2 ఉద్యోగం సాధించాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో జోన్ 3 నుంచి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టణంలో మూడు దశాబ్దాలుగా ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తున్న మంచికట్ల విఠల్ కుమారుడు ఉద్యోగం సాధించడం పట్ల మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దండె రాజయ్య, లింగయ్య, దూస రాము, లక్ష్మీనర్సయ్య, ఎన్నం మునీందర్, క్యాతం పురుషోత్తం, తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయిలో సైనిక్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ సైనిక విద్యాలయం విద్యార్థులు ఇటీవల జరిగిన ఎస్‌ఓఎఫ్ ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి గణితం ఒలంపియాడ్‌లో 60 మంది పాల్గొనగా పన్నెండు మందికి గోల్డ్ మెడల్స్ వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ప్రమోద్ రాజు, గౌతమికృష్ణ, డైరెక్టర్ కేసీరావు, ప్రిన్సిపాల్ జి. కాళహస్తి అభినందించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

చొప్పదండి: ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పట్టణ ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో డీహైడ్రేషన్ నుంచి విముక్తి పొందుతామని, చల్లని ప్రదేశాల్లో సేద తీరాలని, తెల్లని కాటన్ దుస్తులు, తలకు టవల్, రుమాలు ధరించాలని కోరారు. మధ్యాహ్నం పన్నెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పనులకు వెళ్లొద్దని కోరారు.

కలెక్టర్ ప్రశంసా

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి దుర్గం ప్రహర్షను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. 20న జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకుల సంరక్షణ, వాటి గూడు నిర్మాణంతో పాటు వివిధ అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రహర్ష అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో మంగళవారం కలెక్టర్ ఆడిటోరియంలో ప్రత్యేకంగా అభినందించినట్లు హెచ్‌ఎం నివేదిత తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు న్యాత రాజేశ్ నేతృత్వంలో విద్యార్థి చిత్రలేఖనం పోటీలో పాల్గొనడంతో తోటి ఉపాధ్యాయులు రాజేశ్‌ను అభినందించారు.

కొనసాగుతున్న దీక్షలు

గంగాధర: ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాల నియామకాలు చేపట్టొద్దని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష ఆరో రోజుకు చేరుకోగా నిరసనలో నాయకులు చిలుముల రాజయ్య, తడగొండ అశోక్, గంగాధర రవి, దోమకొండ శ్రీనివాస్, రఘు, ద్యావ శ్రీనివాస్, అనిల్, నరేష్, వేణు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



హుజూరాబాద్‌లోని ప్రభుత్వ స్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

వెరీ గుడ్డు

- మధ్యాహ్న భోజన పథకంలో గుడ్డు ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- వంట ఏజెన్సీలకు కాస్తా ఊరట
- ఎనిమిదేళ్ల క్రితంనాటి ధర ఇప్పటివరకు అమలు
- పథకం సక్రమంగా అమలవుతుందని పలువురి అభిప్రాయం

హుజూరాబాద్‌: మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న వంట ఏజెన్సీలకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు వడ్డిస్తున్న గుడ్డు ధరను రూ.6 పెంచుతూ ప్రకటించింది. ఇప్పటివరకు రూ.5 మాత్రమే చెల్లింపు. ఏజెన్సీల నిర్వాహకులు గుడ్లను కొనుగోలు చేసి వారంలో సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు అందించేవారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వివిధ వస్తువుల ధరలను ప్రభుత్వం తరచూ పెంచుతున్నా గుడ్డు ధర మాత్రం పెంచ లేదు. ఎప్పుడో ఎనిమిదేళ్ల కిందట నిర్ణయించిన ధర ఇప్పటివరకు అమలు చేస్తూ వచ్చారు. ఇటీవల గుడ్డు ధర బాగా పెరిగింది. కొన్ని రోజుల కిందట రూ.7 వరకు చేరింది. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర తమకు గిట్టుబాటు కావడం లేదని కొన్ని పాఠశాలల్లోని ఏజెన్సీల నిర్వాహకులు వారంలో రెండు రోజులు మాత్రమే విద్యార్థులకు గుడ్డు అందించేవారు. దీంతో ఉపాధ్యాయులు కూడా సమాధానం చెప్పలేకపోయేవారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం విద్యార్థులు పౌష్టికాహార లోపానికి గురికాకూడదని గుడ్డు ధర పెంచింది. ధరలు ఈ నెల 6వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయని విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 11407 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారు. వీరికి మెనూ ప్రకారం పప్పు, ఆకుకూరలు, సాంబారుతో పాటు మూడు రోజులు గుడ్డు అందిస్తున్నారు. ప్రతిరోజూ సగటున ఐదు నుంచి ఆరువేల మంది విద్యార్థులు భోజనం తింటున్నారు. గుడ్డు వడ్డించే రోజు విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఏజెన్సీలకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి చెల్లిస్తున్న మొత్తాన్ని కూడా గతంలో పెంచింది. బిల్లులు కూడా సకాలంలో అందిస్తోంది. కార్మికులకు ఇటీవల వేతనాలను కూడా విడుదల చేసింది. గతంలో మాదిరిగా కాకుండా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకముందు కూడా ఇలాగే బిల్లులు మంజూరుచేస్తే పథకం సక్రమంగా అమలవుతుందని పలువురు అంటున్నారు.

ప్రతిరోజు గుడ్డు అందించాలి



మధ్యాహ్న భోజనంలో ప్రతిరోజు గుడ్డు అందించేలా చూడాలి. మధ్యాహ్న భోజనంలో పప్పు, సాంబారు, ఆకుకూరలు మాత్రమే అందిస్తున్నారు. గుడ్డు లేకపోవడంతో తినడం ఇబ్బందిగా ఉంది. పౌష్టికాహారం అందించడంతోపాటు విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి.
– లేఖ వల్లిక, ఎనిమిదో తరగతి, హుజూరాబాద్



హుజూరాబాద్‌: మండలంలోని కనుకులగిద్దె నుంచి ధర్మరాజుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన బావి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. రోడ్డు గుండా వెళ్లే వారికి దగ్గరికి వచ్చే వరకూ బావి ఉన్న సంగతి తెలియడం లేదు. కొత్తవారు వస్తే బావి ఉన్న విషయం తెలియక ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్, సెల్ నంబర్: 99899 30709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



వీణవంక: మోడల్ స్కూల్‌లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



చొప్పదండి: ఆర్నకొండలో..



రామడుగు: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



రామడుగు: విద్యార్థులతో ఎంఈవో వేణుకుమార్

వీడ్కోలు హంగామా

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాస్ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైద్యుల రాజిరెడ్డి, లక్ష్మణ్‌కుమార్, కె. రాజమౌళి, హరిత, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని మోతె ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షులు విజేందర్‌రెడ్డి, హెచ్‌ఎం ఒంటెల లక్ష్మణ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బత్తిని శైలజ, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీణవంక: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ లక్ష్య సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎస్సై తోట తిరుపతి, వీణవంక కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల మోడల్ స్కూల్ వార్షికోత్సవం మాట్లాడారు. ప్రిన్సిపాల్ మొహిన్‌బేగ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం మారుమోగింది.మోడల్ స్కూల్ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పర్యావరణ సమతుల్యంతోనే మనుగడ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రామకృష్ణ

జమ్మికుంట: పర్యావరణ సమతుల్యం లోపిస్తే సమస్త జీవుల మనుగడకు ప్రమాదమని, ప్రకృతితోనే మానవ మనుగడ, జీవనం జరుగుతుందని కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డా.కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డా. రమేశ్ అధ్యక్షతన పర్యావరణ అంశంపై రెండు రోజులు నిర్వహించే జాతీయ స్థాయి సెమినార్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన 82మంది ప్రొఫెసర్లు, అధ్యాపకులు హాజరయ్యా. సావనీర్ పుస్తకం ఆవిష్కరించి ప్రకృతి, పర్యావరణంపై కవులు, రచయితలు వందల సంఖ్యలో రచనలు చేశారని, పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా చిప్కో, నర్మదా బచావో వంటి ప్రజా ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నారు. ప్రకృతిని ఆరాధించే సంస్కృతి భారతదేశానిదేనని, ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ రాజావిశ్వనాథం, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాదేవి, జమ్మికుంట కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఓదెలుకుమార్, అధ్యాపకలు డా.శ్యామల, ఉమాకిరణ్, శ్రీనివాస్, గణేశ్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రం, ఉమాదేవి, రాజ్‌కుమార్ వివిధ కళాశాలల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ ఎస్సైలు

హుజూరాబాద్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలోని ఏకశిల పాఠశాల విద్యార్థులకు కలెక్టర్, ఎక్సైజ్‌శాఖ ఆదేశాల మేరకు మత్తుపదార్థాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వినోద్ కుమార్,జుమ్ లాల్, పాఠశాల హెచ్‌ఎం దినేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్ గ్రంథాలయం సందర్శన



వసతులు తెలుసుకుంటున్న మల్లేశ్

హుజూరాబాద్‌: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌తో కలిసి పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, పాఠకులతో మాట్లాడి గ్రంథాలయంలోని సదుపాయాల గూర్చి తెలుసుకున్నారు. ఏడాదిలో రోజుకు వంద మంది విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి చదువుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా పుస్తకాలు పొందుపరచాలని, లైబ్రరీని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతోపాటు ప్రశాంత వాతావరణాన్ని కల్పించి పాఠకులు, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఎస్‌డీఎఫ్ నిధులతో కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామ శివాలయంలో శివపార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. పండితుడు వినోద్‌కుమార్‌శాస్త్రి వేదమంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమం నిర్వహించగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రణవ్, నాయకులు

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామం వొడితెల ప్రణవ్ ఇంటి ఆవరణలో అంబేద్కర్ ఫొటో సాధన సమితి నాయకులు మంగళవారం ప్రణవ్‌తో కలిసి ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పర్శరాం, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రామంచ భరత్ మాట్లాడుతూ.... కరెన్సీ నోట్లపై భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేశారు. నోట్లపై అంబేడ్కర్ బొమ్మ ముద్రించడంతో గౌరవం దక్కుతుందని, అందుకే 26న ఛలో ఢిల్లీ ధూంధాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల ప్రభాకర్, కిరణ్, వడ్లూరి విజయకుమార్, సుగుణాకర్ రెడ్డి, మిడిదొడ్డి శ్రీనివాస్, ఎర్ర ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి భక్తుల విరాళం



దీపపు చెమ్మలు బహూకరిస్తున్న దంపతులు

హుజూరాబాద్: పాటిమీద ఆంజనేయస్వామి ఆలయానికి ఎన్‌ఆర్‌ఐ ముసుకు సుష్మితశ్రీకాంత్‌రెడ్డి దంపతులు రూ.ఇరవై వేలు విలువ చేసే దీపపు చెమ్మలను ఆలయానికి బహూకరించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందించినవారిని ఆశీర్వదించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాస్, మాజీకౌన్సిలర్ అపరాధ ముత్యంరాజు, అర్చకులు తిరుమలయ్య, ప్రదీప్ పాల్గొన్నారు.

నిర్బంధం సిగ్గుచేటు

వీణవంక: ఎంతో మంది మేధావులు చదువుకున్న ఓయూలో నిరసనలకు అడ్డుకట్ట వేయాలనుకోవడం సరికాదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి అప్పని హరీశ్‌వర్మ అన్నారు. వీణవంక మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రజల తరుపున మాట్లాడే గొంతుక ఓయూ విద్యార్థులు అని, ప్రజాపాలన పేరుతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమ గీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని, విద్యార్థుల స్వేచ్ఛను హరించే హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని, ఎమర్జెన్సీని తలపించేలా పాలన చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం విద్యాశాఖను తనవద్దే పెట్టుకొని విద్యా సమస్యలను గాలికొదిలేస్తున్నాడని ఆరోపించారు. నిర్బంధాలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ వైర్లు చోరీ

మానకొండూర్‌రూరల్: మండలంలో వారం రోజులుగా విద్యుత్ మోటార్ల వైర్లు చోరీకి గురవుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ బావుల వద్ద వైర్లు చోరీ చేస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్‌కు నీరు సరఫరా చేసే మోటార్ వైరు కూడా రెండుసార్లు చోరీకి గురికావడంతో ఐదు రోజులుగా గ్రామంలోని కొన్ని కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మహనీయుల చరిత్ర కనుమరుగు చేయొద్దు

కరీంనగర్ మాజీ మేయర్ వై. సునీల్ రావు



సంఘీభావం తెలుపుతున్న సునీల్‌రావు

తిమ్మాపూర్: తిమ్మాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నెలకొల్పిన మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించాలని రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. మంగళవారం దీక్షకు మద్దతుగా బీజేపీ జిల్లా పక్షాన హాజరై సంఘీభావం ప్రకటించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. విగ్రహాల విషయంలో మాజీ ఎమ్మెల్యే రసమయి, ప్రస్తుత ఎమ్మెల్యే కవ్వంపల్లి ఒకరికొకరు ఆరోపణలు చేసుకుంటూ విగ్రహాల ముసుగులు తొలగించడంలో అశ్రద్ధ వహించడం సరికాదని మహనీయుల చరిత్రను కనుమరుగు చేయొద్దన్నారు. మంత్రి పొన్నం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగరావ్, కళ్యాణ్ చంద్ర, మాజీ జెడ్పీటీసీ జోగిరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్, రవీందర్, తిరుపతి రెడ్డి, అరుణ్, గంగరాజం , లక్ష్మణ్, రాజు, వెంకటేశ్ సంఘీభావం ప్రకటించగా జేఏసీ నాయకులు జగదీశ్వరాచారి, శంకర్, రాజయ్య, సంపత్, రాములు, కొమురయ్య, అంజయ్య, జలపతి, అంజయ్య,మల్లేశం, మురళి, మల్లయ్య, శ్రీనివాస్ గౌడ్, మహేష్, సునీల్ రెడ్డి,మల్లేశం గౌడ్, గణేష్, సంపత్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

చొప్పదండి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం లభించడంతో కాంగ్రెస్ నాయకులు చొప్పదండిలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

చిగురుమామిడి: బిల్లు ఆమోదించడం సంతోషించదగిన విషయమని మాజీ జెడ్పీటీసీ రవీందర్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలో స్వీట్లు పంపిణీ చేశారు. విద్యా, ఉద్యోగ , ఉపాధి రంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.

శంకరపట్నం: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడంతో మండలంలోని కేశవపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామంలోని ఆగ్రోస్ దుకాణం ఎదుట మంగళవారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. ఎరువుల దుకాణ వ్యాపారులు పోటాష్ తీసుకుంటేనే యూరియా ఇస్తామని ముడిపెడుతున్నారని రైతులు ఆరోపిస్తూ ఆగ్రోస్ కేంద్రానికి చేరుకున్నారు. సుమారు 400 బస్తాల యూరియా లోడ్ రాగా కొంతమందికి యూరియా బస్తాలు లభించలేదని ఆరోపించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుపై హర్షం

గంగాధర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించడంతో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు బీఆర్‌ఎస్ మొదటి నుంచి సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. పోరాటాలు, ఉద్యమాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలిచిందన్నారు.

సోషల్‌మీడియా పోస్టులపై కౌన్సెలింగ్

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాల ఏర్పాటుపై దళిత, బీసీ సామాజికవర్గాలకు చెందిన కొంతమంది యువకులకు మంగళవారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటు క్రమంలో కొందరు రెచ్చగొట్టే పోస్టులు పెట్టడంతో పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇరు వర్గాలకు చెందినవారితో మండల పరిషత్ సమావేశ మందిరంలో కౌన్సిలింగ్ నిర్వహించి ఇరువర్గాల అభిప్రాయాలను తీసుకున్నారు. కలిసి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, వివాదాలకు పోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్‌రూరల్ సీఐ వెంకట్ స్పష్టం చేశారు. గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాలని, గొడవలు జరిగితే గ్రూప్ అడ్మిన్లపై కేసు, బైండోవర్ చేస్తామన్నారు.